
VC NEWS
# వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...
TELUGU DAILY NEWS
www.veguchukkanews.com
నిజామాబాద్ సోమవారం 12 మే 2025
వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 294
PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



2లో

## 16 నుంచి ఐపీఎల్?



2లో

కశ్మీర్‌పై పరిష్కారానికి పాటుపడతా: ట్రంప్
నేడు డీజీఎంవోల చర్చలుఆపరేషన్ సిందూర్‌తో పాక్‌కు చావుదెబ్బ
సైనికంగా, రాజకీయంగా, భావోద్వేగపరంగా విజయం మోదీ మాట నిలబెట్టుకున్నారు: ప్రభుత్వ వర్గాలు

# సిందూరం తుడిచేసిన వారిని శిక్షించాం





- అన్నివిధాలా పైచేయి సరిహద్దుల్లోనే కాదు.. రావల్పిండి వరకు వినిపించాం
- సిందూరం తుడిచేసిన వారిని శిక్షించాం ఆపరేషన్ సిందూర్‌పై రాజ్‌నాథ్
- అత్యంత కచ్చితత్వంతో లక్ష్యాలను ఛేదించాం: వాయుసేన
- పాక్ అత్యాధునిక యుద్ధ విమానాలను నేలకూల్చాం కీలక యుద్ధ స్థావరాలను పేల్చేశాం

### మాకు ఎవరి మధ్యవర్తిత్వం అవసరం లేదు: ప్రధాని మోడీ

భారత్, పాకిస్తాన్ మధ్య కాల్పుల విరమణ అనంతరం ప్రధాని నరేంద్రమోడి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదివారం తన నివాసంలో త్రివిద దళాధిపతులు, రక్షణ మంత్రి రాజనాథ్ సింగ్, సీడీఎస్ అనిల్ చౌహాన్, జాతీయ భద్రత సలహాదారులు దోవల్ సమావేశమయ్యారు. ఆపరేషన్ సింధూర్ ముగియలేదని పాకిస్తాన్ కాల్పులు జరిపితే భారత్ కూడా అదే స్థాయిలో కాల్పులతోనే జవాబు చెబుతుందన్నారు. కాశ్మీర్ విషయంలో భారత్ వైఖరి ఎప్పుడు ఒకే విధంగా ఉంటుందన్నారు. ఉగ్రవాద చర్యలు జరుగకుండా ఉండాలంటే పీవోకేను భారత్ కు అప్పగించడం తప్ప పాకిస్తాన్ మరో గత్యంతరం లేదని సంచలన వ్యాఖ్యలు చేశారు. కాశ్మీర్ విషయంలో గానీ, పీవోకే అంశంలో ఎవరు మధ్యవర్తులు మాట్లాడవద్దని ప్రధాని మోడి అన్నారు. ఉగ్రవాదులను అప్పగించే విషయంలో మాత్రమే పాకిస్తాన్ మాట్లాడితే చర్చిస్తామని మరే విషయంలోనూ చర్చలు జరిపే ఉద్దేశ్యం లేదన్నారు.





2లో

# ఇంజినీరింగ్‌లో 73.26% ..

**అగ్రికల్చర్‌లో 87.82% ఉత్తీర్ణత నమోదు**

తెలంగాణ ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మా ఉమ్మడి ప్రవేశ పరీక్ష (ఈఏపీసెట్-ఎప్‌సెట్) ఇంజినీరింగ్ విభాగంలో 73.26%... అగ్రికల్చర్-ఫార్మా విభాగంలో 87.82% మంది ఉత్తీర్ణులయ్యారు.

- ఎప్‌సెట్ ఫలితాలు విడుదల చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- ఇంజినీరింగ్‌లో తొలి పది ర్యాంకులు అబ్బాయిలకే... అగ్రికల్చర్‌లోనూ 9 కైవసం
- ఉత్తీర్ణతలో అమ్మాయిలే మెరుగు

ఫలితాల సీడీని ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో యోగితా రాణా, బాలకిష్టారెడ్డి, కిషన్‌కుమార్‌రెడ్డి


## హైదరాబాద్ మెట్రోకు అరుదైన గౌరవం



- పరిశోధన పత్రం ప్రచురించిన హార్వర్డ్ యూనివర్సిటీ
- ప్రపంచంలోనే అతి పెద్ద పీపీపీ మెట్రోగా గుర్తింపు
- హెచ్ఎంఆర్ విజయాలను కేస్ స్టడీగా తీసుకున్న వైనం

హైదరాబాద్: హైదరాబాద్ మెట్రోరైల్‌కు మరో అరుదైన గౌరవం లభించింది. ప్రతిష్టాత్మకమైన హార్వర్డ్ విశ్వవిద్యా లయం హైదరాబాద్ మెట్రోపై పరిశోధన పత్రాన్ని సమర్పించింది. ప్రపంచంలోనే ఎంతో పేరొందిన అతిపెద్ద పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్య (పీపీపీ) ప్రాజెక్టు అంటూ అందులో ప్రముఖంగా ప్రస్తావించింది. హైదరాబాద్ మెట్రో రైల్‌కు ఐఎస్‌బీ, స్టాన్‌ఫర్డ్ వంటి అంతర్జాతీయ విశ్వవిద్యాలయాల నుంచి ఇప్పటికే సముచితమైన గుర్తింపు లభించింది. మన మెట్రో విజయగాథను పరిశోధనా పత్రాలుగా ప్రచురించాయి.తాజాగా హెచ్ఎంఆర్ఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి సారథ్యంలో మెట్రో రైల్ వ్యవస్థ ఒక ప్రముఖ రవాణా వ్యవస్థగానే కాకుండా మౌలిక వసతుల కల్పనలో నూతన ఒరవడిని ప్రదర్శించిందని, పీపీపీ విధానంలో ప్రపంచంలోనే విశేషమైన ప్రాజెక్టుగా అవతరించిందని హార్వర్డ్ వర్సిటీ తన పరిశోధనా పత్రంలో స్పష్టం చేసింది.

## సీతారామ ప్రాజెక్టుపై మంత్రి ఉత్తమ్‌వి అవగాహన లేని వ్యాఖ్యలు



**ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేసే సీతారామ ప్రాజెక్టుపై నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని, ఈ ప్రాజెక్టుకు అనుమతులు లేవని మంత్రి అబద్ధాలు మాట్లాడడం దుర్మార్గమని భారాస సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు.**

హైదరాబాద్: ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేసే సీతారామ ప్రాజెక్టుపై నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని, ఈ ప్రాజెక్టుకు అనుమతులు లేవని మంత్రి అబద్ధాలు మాట్లాడడం దుర్మార్గమని భారాస సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. సాగునీటి రంగంలో తెలంగాణకు 50 ఏళ్ల కాంగ్రెస్ పాలన అన్యాయం చేస్తే.. తొమ్మిదిన్నరేళ్ల భారాస పాలన న్యాయం చేసి విజయ బావుటా ఎగురవేసిందని పేర్కొన్నారు. సీతారామ ప్రాజెక్టుపై ఉత్తమ్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ హరీశ్‌రావు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. '2018 అక్టోబరు 30న సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)ని భారాస ప్రభుత్వం కేంద్ర జల సంఘానికి(సీడబ్ల్యూసీకి) అందజేసింది. 2021 సెప్టెంబరు, అక్టోబరు నెలల్లోనే 113.795 టీఎంసీల నీళ్లు ప్రతిపాదిత సీతారామ ప్రాజెక్టులో అందుబాటులో ఉన్నాయని సీడబ్ల్యూసీ హైడ్రాలజీ విభాగం నిర్ధారించింది. ఈ ప్రాజెక్టు కింద 70.4 టీఎంసీల నీటిని వినియోగించి 6.74 లక్షల ఎకరాలకు సాగు నీటిని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాలకు ఇవ్వవచ్చని, తాగునీటితోపాటు పారిశ్రామిక అవసరాలకు వాడుకోవచ్చని కేంద్రం 2021లోనే నిర్ధారించింది. ఇంత స్పష్టంగా సీడబ్ల్యూసీ, హైడ్రాలజీ అనుమతులు ఉన్న సీతారామ ప్రాజెక్టుకు నీటి కేటాయింపులు జరగలేదని మాట్లాడడం మంత్రి ఉత్తమ్, కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అబద్ధపు ప్రచారాలకు పరాకాష్ఠ. ఏపీ పాలకులు గోదావరిలో నీటి దోపిడీకి పాల్పడుతుంటే అడ్డుకునే సత్తా కాంగ్రెస్‌కు లేదు. భారాస పాలనపై విమర్శలు కాకుండా.. మిగిలిపోయిన ప్రాజెక్టు పనులను చిత్తశుద్ధితో పూర్తి చేయాలని ఉత్తమ్‌ను కోరుతున్నా" అని హరీశ్ పేర్కొన్నారు.


## జాతీయ రహదారుల అభివృద్ధికి రూ.31 వేల కోట్లు



హైదరాబాద్: ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో రాష్ట్రానికి 2014 నుంచి ఇప్పటి వరకు జాతీయ రహదారుల అభివృద్ధి కోసం సుమారు రూ.31 వేల కోట్లు కేటాయించామని కేంద్రమంత్రి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు జాతీయ రహదారుల కోసం కేంద్రం కేటాయించిన నిధుల వివరాలను ఆదివారం ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. "రాష్ట్రంలో 2,722 కిలోమీటర్ల జాతీయ రహదారుల నిర్మాణం జరిగింది. మరో 2,526 కి.మీ రాష్ట్ర రోడ్లను జాతీయ రహదారులుగా ఉన్నతీకరించాం. భారతమాల పరియోజన ప్రాజెక్టు మొదటి దశ కింద రూ.38,297 కోట్ల భారీ బడ్జెట్‌తో రాష్ట్ర వ్యాప్తంగా 1,719 కిలోమీటర్ల జాతీయ రహదారులను అభివృద్ధి చేయనున్నాం.

దీంతో ఆర్థిక ప్రగతి, ఉపాధి అవకాశాలు, ప్రజలకు మెరుగైన రవాణా సదుపాయాలు పెరుగుతాయి" అని కిషన్‌రెడ్డి పోస్టులో పేర్కొన్నారు.


## నేటి నుంచి మరో 25 చోట్ల స్లాట్





హైదరాబాద్: ఎదురు చూపులకు తెర దించుతూ స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో అమల్లోకి తీసుకొచ్చిన స్లాట్ విధానాన్ని సోమవారం నుంచి మరో 25 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమల్లోకి తేనున్నారు. గత నెల 10 నుంచి 22 చోట్ల పైలట్ ప్రాజెక్టు కింద అమలు చేయగా మంచి ఫలితాలు వచ్చినట్లు గుర్తించి ఈ పద్ధతిలో ముందుకు వెళ్లాలని అధికారులు నిర్ణయించారు. స్లాట్ విధానంలో రోజుకు 45 రిజిస్ట్రేషన్లు పూర్తయ్యేలా పరిమితి విధించారు. పెద్ద కార్యాలయాల్లో ఈ సంఖ్యకు రెండింతలకు పైగా ఒత్తిడి ఉంటుంది. దీనిని దృష్టిలో పెట్టుకుని ఉప్పల్, మహేశ్వరం, మంచిర్యాలల్లో అదనంగా ఒక్కో సబ్ రిజిస్ట్రార్, సిబ్బందిని నియమిస్తున్నారు. దీనికితోడు సమీప ప్రాంతాల్లో ఉండే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల విలీనం చేపడుతున్నారు. పైలట్ కింద ఇప్పటికే చంపాపేట, సరూర్‌నగర్ కార్యాలయాలను ఏకీకృతం చేశారు. స్లాట్ నమోదు చేసుకుంటే రద్దీని బట్టి ఏ కార్యాలయానికి వెళ్లాలో వినియోగదారుకు కంప్యూటర్ ద్వారా ఎస్ఎంఎస్ పంపిస్తున్నారు. ఇప్పుడు కొత్తగా ఏకీకృత సేవలను షాద్‌నగర్-ఫరూక్‌నగర్, సిద్దిపేట అర్బన్-సిద్దిపేట రూరల్ కార్యాలయాల్లో అమలు చేయనున్నారు.అమల్లోకి వచ్చేది ఇక్కడే... హైదరాబాద్ రిజిస్ట్రార్ కార్యాలయం, హైదరాబాద్ దక్షిణ, నారపల్లి, ఘట్‌కేసర్, మల్కాజిగిరి, ఉప్పల్, కాప్రా, బీబీనగర్, సిద్దిపేట అర్బన్, సిద్దిపేట రూరల్, గజ్వేల్, మంచిర్యాల, పెద్దపల్లి, వరంగల్, జనగామ, ఘన్‌పూర్, నర్సంపేట, కల్వకుర్తి, నారాయణపేట, మహేశ్వరం, రంగారెడ్డి, షాద్‌నగర్, ఫరూక్‌నగర్, వనస్థలిపురం, శేరిలింగంపల్లి రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కొత్తగా స్లాట్ విధానం తెస్తున్నారు.

## 'మేము తిట్టడం మొదలుపెడితే ఉరేసుకోవాలి'



హైదరాబాద్: సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర పదజాలాన్ని వాడటం బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్ కు ఎంతవరకూ కరెక్ట్ అని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ప్రశ్నించారు. ఈటెల మాట్లాడిన మాటలు ఎంపీ స్థాయి మాటల్లా లేవని, గంజాయి తాగిన వ్యక్తి మాటల్లా ఉన్నాయంటూ జగ్గారెడ్డి కౌంటర్ ఇచ్చారు. సీఎం రేవంత్ పై ఈటెల చేసిన వ్యాఖ్యలపై ప్రెస్ మీట్ పెట్టిన జగ్గారెడ్డి.. ' నేను తిట్టడం కోసం ప్రెస్ మీట్ పెట్టా. మీకేనా తిట్టడం వచ్చింది.. మాకు రాదా?, మేము తిట్టడం మొదలుపెడితే ఉరేసుకోవాలి' అంటూ జగ్గారెడ్డి ధ్వజమెత్తారు.

ఈటెల ఏరోజైనా సీఎంను కలిసి తన పార్లమెంట్ సమస్యల గురించి అడిగారా? అని జగ్గారెడ్డి నిలదీశారు. ఏదో ఫ్రస్టేషన్ లో ఈటెల మాట్లాడుతున్నట్లు ఉందని, సీఎంను తనకు పోస్ట్ వస్తుందని ఆయన భావిస్తున్నట్లు ఉందన్నారు. ఈటెల పరిధి దాటి మాట్లాడాడు కాబట్టే తాను కూడా మాట్లాడుతున్నానన్నారు జగ్గారెడ్డి. ఆయన పెద్ద తోపేంద కాదని, పెద్ద పర్సనాలిటీ అని ఈటెల తనకు తానే ఊహించుకుంటున్నారని విమర్శించారు. గౌరవ ప్రదమైన విమర్శలు చేస్తే తప్పులేదు కానీ, ఈ తరహా వ్యాఖ్యలు సీఎంపై చేస్తారా అంటూ జగ్గారెడ్డి నిలదీశారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రూపాయి తెచ్చే తెలివి లేదు కానీ ఉద్దెర విమర్శలు ఎందుకన్నారు జగ్గారెడ్డి.

సీఎం ఓ తుగ్లక్. నువ్వో శాడిస్ట్ కాంగ్రెస్ ప్రభుత్వం తలాతోకా లేకుండా వ్యవహరిస్తోందని, ఇదిలాగే ఉంటే ఇంకా ఎన్నో రోజులు కొనసాగదని బీజేపీ నేత, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేం దర్ హెచ్చరించారు. 'ఇది తుగ్లక్ ప్రభుత్వం, సీఎం ఓ తుగ్లక్. నువ్వో శాడిస్ట్, సైకోవి కాబట్టి ప్రజలను ఏడిపి స్తున్నావు.

వేగుచుక్క

# సిందూరం తుడిచేసిన వారిని శిక్షించాం

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడి అనంతరం పాకిస్తాన్‌తో నాలుగు రోజుల పాటు జరిగిన ఘర్షణలో సైనికంగా, రాజకీయంగా, మానసిక భావోద్వేగపరంగా భారత్ పూర్తిగా పైచేయి సాధించినట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాలు ఆదివారం అభిప్రాయపడ్డాయి. పాకిస్తాన్ గడ్డ పైనుంచి భారత్‌కు వ్యతిరేకంగా కుట్రలు సాగిస్తే శిక్ష తప్పదన్న స్పష్టమైన సంకేతాలను ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చారని తెలిపాయి. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా ఉగ్రవాద సంస్థల ప్రధాన కేంద్రాలు, కీలక స్థావరాలు, శిక్షణ కేంద్రాలు, మౌలిక సదుపాయాలను భారత సైన్యం ధ్వంసం చేయడం తెలిసిందే.

లష్కరే తొయిబా, జైషే మొహమ్మద్, హిజ్బుల్ ముజాహిదీన్‌కు చెందిన తొమ్మిది స్థావరాలు నామరూపాల్లేకుండా పోయాయి. ముష్కరులను మట్టిలో కలిపేస్తామన్న మాటను మోదీ నిలబెట్టుకున్నారని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. ఉగ్రవాదుల ఇళ్లల్లో దూరి మరీ బుద్ధి చెప్తామని హెచ్చరించినట్టుగానే పాక్‌తో పాటు పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లో సైన్యం చేసిన దాడుల్లో 100 మందికిపైగా ఉగ్రవాదులు హతమయ్యారు. వారిలో అత్యంత కరడుగట్టిన ఉగ్రవాదులూల ఉన్నారు. ముష్కరులను వారి సొంత గడ్డపైనే





దెబ్బకొట్టడంలో విజయం సాధించామయని ప్రభుత్వ వర్గాలు అంటున్నాయి.

'సింధూ' ఒప్పందం నిలిపివేతపై పాక్ హాహాకారాలు

పాక్ ఉగ్రవాదులను వారి సొంత దేశంలోనే మట్టుబెట్టడగలమన్న సంగతి ఆపరేషన్ సిందూర్ ద్వారా తేలిపోయింది. ఇది భారతీయులకు భావోద్వేగభరిత విజయంగా పరిగణిస్తున్నారు

. ఉగ్రవాదులు ఎక్కడ నక్కినా చావుదెబ్బ కొట్టగలమని సైన్యం నిరూపించింది. పహల్గాం దాడి తర్వాత సింధూ నది జలాల ఒప్పందాన్ని భారత ప్రభుత్వం నిలిపివేసింది. దానిపై పాక్ హాహాకారాలు చేసినా పట్టించుకోలేదు. 1960 నుంచి నిరాటంకంగా

కొనసాగుతూ వచ్చిన ఒ ప్పందం ఒక్కసారిగా ఆగిపోవడం పాక్‌కు మింగుడుపడడం లేదు. ప్రపంచ దేశాలకు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండాపోయింది. ఇది భారత్‌కు అతిపెద్ద రాజకీయ విజయమని నిపుణులు పేర్కొంటున్నారు. సీమాంతర ఉగ్రవాదాన్ని పూర్తిగా ఆపేదాకా ఈ ఒప్పందాన్ని నిలిపివేస్తామని పాకిస్తాన్‌కు భారత్ తేల్చిచెప్పింది.

# 16 నుంచి ఐపీఎల్?

భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతల కారణంగా సస్పెండైన ఐపీఎల్ ఈ నెల 16 లేదా 17వ తేదీన ఆరంభమయ్యే అవకాశముంది. కాల్పుల విరమణ ప్రకటనతో ఐపీఎల్‌కు మార్గం సుగమం అయిన సంగతి తెలిసిందే.

దిల్లీ:భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతల కారణంగా సస్పెండైన ఐపీఎల్ ఈ నెల 16 లేదా 17వ తేదీన ఆరంభమయ్యే అవకాశముంది. కాల్పుల విరమణ ప్రకటనతో ఐపీఎల్‌కు మార్గం సుగమం అయిన సంగతి తెలిసిందే. అయితే టోర్నీ తిరిగి ప్రారంభం కావడం అన్నది ప్రభుత్వ నిర్ణయంపై ఆధారపడి ఉంది. టోర్నీ పునరుద్ధరణ గురించి ఐపీఎల్ పాలకవర్గ సభ్యులు, బీసీసీఐ అధికారులు ఆదివారం చర్చించారు. బీసీసీఐ ఇంకా షెడ్యూలును సిద్ధం చేసే పనిలో ఉందని బోర్డు ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా చెప్పాడు. "ఇప్పటివరకైతే ఐపీఎల్‌పై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. బీసీసీఐ కార్యదర్శి, ఐపీఎల్ ఛైర్మన్ ఫ్రాంఛైజీలతో మాట్లాడతారు. త్వలోనే నిర్ణయం తీసుకుంటాం. టోర్నమెంట్‌ను త్వరగా ప్రారంభించడానికి కృషి జరుగుతోంది" అని చెప్పాడు. మే 16 లేదా 17న టోర్నీ తిరిగి ఆరంభం కానున్నందున ఆటగాళ్లను వెనక్కి పిలవాలని ఫ్రాంఛైజీలతో బీసీసీఐ చెప్పినట్లు తెలుస్తోంది. మిగిలిన లీగ్ మ్యాచ్‌లను డబుల్ హెడర్‌లతో ముగించనున్నారు. జూన్ 1న ఐపీఎల్ ఫైనల్ జరిగే అవకాశముంది. టోర్నీలో 16 మ్యాచ్‌లను కేవలం నాలుగు నగరాలు హైదరాబాద్, చెన్నై, కోల్‌కతా, బెంగళూరులో నిర్వహించే అవకాశముంది. సీఎస్కే, రాజస్థాన్, సన్‌రైజర్స్ ఇప్పటికే ప్లేఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించిన సంగతి తెలిసిందే.ప్రభుత్వ అనుమతితోనే..: ఐపీఎల్‌ను తిరిగి ప్రారంభించడానికి ప్రభుత్వ అనుమతి తప్పనిసరి అని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా అన్నాడు. "వచ్చే కొన్ని రోజుల్లో ఫ్రాంఛైజీలు, ప్రసారదారు, స్పాన్సర్లు, మిగతా మ్యాచ్‌లకు ఆతిథ్యమివ్వాల్సిన రాష్ట్ర సంఘాలతో సంప్రదింపులు మొదలుపెడతాం. ఆ తర్వాత ఐపీఎల్ పునరుద్ధరణపై నిర్ణయం తీసుకుంటాం. అయితే లీగ్ తిరిగి ప్రారంభించడానికి ప్రభుత్వ అనుమతి తప్పనిసరి" అని చెప్పాడు.ఆ జట్లకు చెరో పాయింట్: భారత్, పాక్‌ల మధ్య ఉద్రిక్తతల కారణంగా ధర్మశాలలో పంజాబ్ కింగ్స్, దిల్లీ క్యాపిటల్స్ మధ్య మ్యాచ్ రద్దయిన సంగతి తెలిసిందే. మ్యాచ్ ఆగిపోయే సమయానికి పంజాబ్ 10.1 ఓవర్లలో వికెట్ నష్టానికి 122 పరుగులు చేసింది. ఆ మ్యాచ్‌ను కొనసాగించడం, లేదా మొదటి నుంచి నిర్వహించడం ఉండకపోవచ్చు. రెండు జట్లకు చెరో పాయింట్ ఇచ్చే అవకాశం ఉంది.

## ఇంజినీరింగ్‌లో 73.26% .. అగ్రికల్చర్‌లో 87.82% ఉత్తీర్ణత నమోదు

హైదరాబాద్: తెలంగాణ ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మా ఉమ్మడి ప్రవేశ పరీక్ష (ఈఏపీసెట్- ఎప్‌సెట్) ఇంజినీరింగ్ విభాగంలో 73.26%... అగ్రికల్చర్-ఫార్మా విభాగంలో 87.82% మంది ఉత్తీర్ణులయ్యారు. రెండు విభాగాల్లో అబ్బాయిలే టాప్ ర్యాంకు సాధించారు. ఇంజినీరింగ్‌లో తొలి పది ర్యాంకులు, అగ్రికల్చర్ విభాగంలో మొదటి పదిలో తొమ్మిది ర్యాంకులను అబ్బాయిలే కైవసం చేసుకున్నారు.ఇంజినీరింగ్‌లో అబ్బాయిలు 72.79%, అమ్మాయిలు 73.88% మంది ఉత్తీర్ణులుకాగా... అగ్రికల్చర్‌లో అబ్బాయిలు 86.29%, అమ్మాయిలు 88.32% మంది ఉత్తీర్ణులయ్యారు. రెండింటిలోనూ అమ్మాయిల అర్హత శాతం అధికంగా ఉండటం విశేషం. ఎప్‌సెట్ ఇంజినీరింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగాల ర్యాంకులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం తన నివాసంలో విడుదల చేశారు. ఉత్తీర్ణులైన వారందరికీ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ వి.బాలకిష్టారెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, జేఎన్‌టీయూహెచ్ ఉపకులపతి టి.కిషన్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర సాంకేతిక విద్య కమిషనర్ శ్రీదేవసేన, ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షుడు పురుషోత్తం, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్, ఎప్‌సెట్ కన్వీనర్ బి.డీన్‌కుమార్, కోకన్వీనర్ కె.విజయకుమార్‌రెడ్డి, జేఎన్‌టీయూహెచ్ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

వరుసగా రెండేళ్లు ఉత్తరాంధ్ర విద్యార్థులదే తొలి ర్యాంకు

ఇంజినీరింగ్‌లో ఏపీలోని పార్వతీపురం జిల్లా కొమరాడకు చెందిన పల్లా భరత్‌చంద్ర 160 మార్కులకు 150.058 సాధించి ప్రథమ ర్యాంకు పొందాడు. ఈ విద్యార్థి ఇంటర్‌మీడియట్‌ను హైదరాబాద్‌లోనే చదివాడు. ఈ విభాగంలో 138.25 మార్కులకు పదో ర్యాంకు దక్కింది. గత ఏడాది ఎప్‌సెట్‌లో కూడా శ్రీకాకుళం జిల్లా పాలకొండకు చెందిన సతివాడ జ్యోతిరాదిత్య 160కి 155.63 మార్కులు సాధించి ప్రథమ ర్యాంకు కైవసం చేసుకున్నాడు. వరుసగా రెండేళ్లపాటు ఇంజినీరింగ్‌లో ఉత్తరాంధ్ర విద్యార్థులే తొలి ర్యాంకు సాధించడం విశేషం. అగ్రికల్చర్ విభాగంలో హైదరాబాద్‌కు చెందిన సాకేత్‌రెడ్డి 141.68 మార్కులు సాధించి తొలి ర్యాంకు సొంతం చేసుకున్నాడు. ఈ విభాగంలో 136.49 మార్కులకు పదో ర్యాంకు దక్కింది. రెండు విభాగాల్లో టాప్ 10 ర్యాంకర్లలో ఒక్కరే అమ్మాయి ఉన్నారు. అగ్రికల్చర్ విభాగంలో మాదాపూర్‌లో చదివిన రెండ్ల బ్రాహ్మణి 138.71 మార్కులు సాధించి ఐదో ర్యాంకు సాధించింది. ఇంజినీరింగ్‌లో ఉత్తీర్ణత ఏటేటా కిందికి...

ఇంజినీరింగ్‌లో గతేడాదితో పోలిస్తే ఈసారి ఉత్తీర్ణత శాతం స్వల్పంగా తగ్గింది. ఈ ఏడాది గణితం ప్రశ్నలను కఠినంగా ఇచ్చారని విద్యార్థులు తెలిపారు. 2022తో పోలిస్తే ఈసారి 7 శాతానికిపైగా ఉత్తీర్ణత తగ్గడం విశేషం. ఎప్‌సెట్‌లో 160 ప్రశ్నలకు 180 నిమిషాల్లో సమాధానం ఇవ్వాలి. 40 మార్కులు వస్తే ఉత్తీర్ణులవుతారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు కనీస మార్కుల నిబంధన వర్తించదు. మొత్తం 55,411 మంది అర్హత సాధించలేదు. అగ్రికల్చర్-ఫార్మా విభాగంలో ఈసారి ఉత్తీర్ణత దాదాపు 2 శాతం తగ్గింది ఈ విభాగంలో 9,889 మంది కనీస మార్కులు సాధించకపోవడంతో అర్హత పొందలేదు.ఎప్‌సెట్‌లో గురుకుల విద్యార్థుల సత్తాసంక్షేమ గురుకుల సొసైటీ విద్యార్థులు ఎప్‌సెట్ ఫలితాల్లో సత్తా చాటారు. గిరిజన గురుకులాల విద్యార్థులు దాదాపు 170 మందికి వారి ర్యాంకుల ఆధారంగా జేఎన్‌టీయూ, ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీతో పాటు ఇతర ప్రతిష్ఠాత్మక ఇంజినీరింగ్ కళాశాలల్లో సీట్లు లభిస్తాయని సొసైటీ కార్యదర్శి సీతాలక్ష్మి తెలిపారు. ఇద్దరు విద్యార్థులు వెయ్యిలోపు ర్యాంకులు పొందారని చెప్పారు. బీసీ గురుకుల విద్యార్థులు ఇంజినీరింగ్ విభాగంలో 66 మంది, వ్యవసాయ-ఫార్మసీ విభాగంలో 35 మంది ప్రతిభ చూపించారని ఆ సొసైటీ కార్యదర్శి సైదులు పేర్కొన్నారు.

# గోబెల్స్ ప్రచారాన్ని నమ్ముకున్న పాక్ !

పోరాడే శక్తి లేకపోవడంతో ఇప్పుడు పాకిస్థాన్ అబద్దాల ప్రచారంలో దూసుకుపోతోంది. యుద్ధంలో తామేదో విజయం సాధించి, భారత్‌పై పైచేయి సాధించామని ప్రపంచానికి తెలియచేసి మార్కులు కొట్టేయాలన్న తపనలో అబద్దాలను నమ్ముకుంది. అయితే పాక్ కుయుక్తులు తెలిసిన ప్రపంచదేశాలు వీటిని నమ్మకున్నా... ఫేక్ వార్తలను ప్రచారం చేస్తోంది. జర్మనీ నియంత వెంట ఉన్న గోబెల్స్‌ను మించి ప్రచారం చేస్తోంది. గోబెల్స్ ఉంటే ఆయన ఆశ్చర్య పోయేలా ప్రచారాలను పేలుస్తోంది. జర్మన్ నియంత హిట్లర్‌ను ముంచినట్లే ఇప్పుడు పాక్‌ను కూడా ఈ ప్రచారాలు ముంచడం ఖాయం. ఇకపోతే పాక్‌కు మద్దతుగా ఏ ఒక్కదేశం ముందుకు రావడం లేదు. అలాగే టర్కీ వచ్చినా దాని పాత్ర నామమాత్రమే. రెండురోజుల యుద్దానికే పాక్‌కు చుక్కలు కనిపిస్తున్నాయి. అనవసరంగా తోక కాల్చుకున్నట్లుగా ఇప్పుడు పాక్ పరిస్థితి ఏర్పడింది. భారత్ ప్రతిదాడులతో పాక్ కకావికలం అవుతోంది. అసలు యుద్ధం ముందున్నది. దీంతో పాక్ దిమ్మతిరిగేలా భారత్ సమాధానం ఇవ్వనుంది. ఇవన్నీ పాక్ పాలకులకు, అక్కడి సైన్యానికి తెలుసు. అయితే ప్రజలను నమ్మించాలి. నమ్మించలేక పోతే ప్రజలు తిరుగుబాటు చేస్తారు. క్రికెట్ ఓడిపోతేనే అక్కడి ప్రజలు రాళ్లతో కొడతారు. అలాంటి యుద్ధమంటే ఆషామాషీ కాదు. అ÷-దుకే భారత్ బలగాలను దెబ్బ తీసామని, విమానాశ్రయాలు కూల్చామని, భారత్ యుద్ధవిమానాలను కూల్చేశామని అబద్దాలు ప్రచారం చేస్తోంది. దీనిని భారత్ ఎప్పటికప్పుడు ఖండిస్తోంది. అసలు వాస్తవాలను ప్రపంచానికి తెలియచేస్తోంది. భారత్ ఆపరేషన్ సిందూర్ నిర్వహిస్తున్న నేపథ్యంలో పాకిస్థాన్ తప్పుడు ప్రచారంతో సోషల్‌మీడియాలో ఇలా వక్రబుద్ధిని చాటుకుంటున్నది. దాయాది చేస్తున్న అసత్య ప్రచారాన్ని కేంద్ర ప్రభుత్వం తిప్పికొడు తున్నది. సామాజికమాధ్యమాల్లో ప్రసారమవుతున్న వార్తల్లో నిజానిజాలను ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో పీఐబీ ఫ్యాక్ట్‌చెక్ ద్వారా తేటతెల్లం చేస్తున్నది. శుక్రవారం మీడియాలో పలు అంశాలు ప్రచారం కాగా, వాటిపై పీఐబీ ఫ్యాక్ట్‌చెక్ చేసి, దేశప్రజలకు వాస్తవాలకు నివేదించింది. పాకిస్థాన్‌తోపాటు పలు మీడియా సంస్థలు కూడా పాత ఫొటోలు, వీడియోలను ప్రస్తుత యుద్ధానికి సంబంధించినవిగా చిత్రీకరిస్తూ అసత్యప్రచారానికి పూనుకుంటున్నది. దీనిపై భారత్ ముందస్తుగా స్పందిస్తూ వాస్తవాలు, పారదర్శకతతో తప్పుడు సమాచారానికి చెక్ పెడుతూనే ఉన్నది. నిజానికి భారత్ ప్రతిదాడితో పాక్‌లో అనేక స్థావరాలు దెబ్బ తిన్నాయి. నాలుగు ఫైట్ జెట్లను భారత దళాలు కూల్చేశాయి. లాహోర్ విమాన వ్యవస్థను కుప్పకూల్చింది. ఇవన్నీ బయటకు రాకుండా పాక్ నానా తంటాలు పడుతోంది. ఇందుకోసం అబద్దాలను, అర్థసత్యాలను ప్రచారం చేస్తోంది. వీటిని భారత రక్షణ శాఖ ఫోటోలతో సహా ఎప్పటికప్పుడు తిప్పికొడుతూ ప్రపంచాన్ని అప్రమత్తం చేస్తోంది. అలాగే భారతదేశ ప్రజలు ఆందోళనకు, భావోద్వేగాలకు గురికాకుండా చూస్తున్నది. సందేహాలకు తావులేకుండా చేస్తున్నది. అంతేకాదు ప్రజలకు సైతం నకిలీ వార్తలను ఎలా గుర్తించాలో అవగాహన కల్పించే ప్రచారాలకు శ్రీకారం చుట్టింది. పాకిస్థాన్ వైమానికదళం శ్రీనగర్ వైమానిక స్థావరాన్ని లక్ష్యంగా చేసుకుందని, పలు జెట్ విమానాలను కూల్చడంతోపాటు-, భారత సైనికులను పట్టుకుందని, ఈ దాడిలో భారత్ తీవ్రంగా నష్టపోయిందని పాకిస్థాన్ మీడియా చానళ్లు ప్రచారం చేశాయి. పాక్ మంత్రులు సహా ఉన్నతాధికారులు ఆ కంటెంట్‌ను ప్రచారం చేశారు. భారత్ దీనిపై వెంటనే స్పందించింది. రియల్ టైమ్ ఫ్యాక్ట్‌చెకింగ్ ద్వారా ఆ వీడియో మూలాలను గుర్తించింది. పాక్ అసత్య ప్రచారానికి చెక్ పెట్టింది. వాస్తవానికి ఆ దృశ్యాలు 2024 ప్రారంభంలో పాకిస్థాన్‌లోని ఖైబర్‌లో జరిగిన మత ఘర్షణలకు సంబంధించినవిగా తేటతెల్లం చేసింది. తమదేశంలోనే జరిగిన దాడిని భారత్‌లో జరిగిన దాడిగా నమ్మించే ప్రయత్నం పాక్ చేసింది. భారత బ్రిగేడ్ ప్రధాన కార్యాలయాన్ని ధ్వంసం చేసినట్టు పాకిస్థాన్ మరో పుకారును సృష్టించింది. దానిని కూడా భారత్ తేటతెల్లం చేసింది. సెప్టెంబర్ 2024లో రాజస్థాన్‌లోని బార్మర్‌లో ఎంజీ 29 జెట్ క్రాష్ అయింది. ఆ పాత చిత్రాన్నే వక్రీకరించి పాకిస్థాన్ అనుకూల సోషల్ మీడియా అసత్య ప్రచారానికి తెరతీసింది. దానిని కూడా భారత్ ఆధారాలతో బయటపెట్టింది. కశ్మీర్‌లో కనీసం 3 భారతీయ జెట్లు కూలిపోయాయని చైనా డైలీ ప్రచారానికి పూనుకుంది. అయితే భారత్ దానిలో నిజానిజాలను బయట పెట్టింది. చైనా డైలీ ప్రచారం చేసిన చిత్రం 2019 నాటి ఒక సంఘటనకు సంబంధించిందని ఆధారాలతో బయటపెట్టింది. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ పేరిట ఫేస్‌బుక్‌లో దుండగులు ఒక ఫేక్ అకౌంట్‌ను సైతం సృష్టించారు. పాకిస్థాన్ రహస్యంగా సైబర్ అటాక్స్ చేస్తున్నదని, పౌరులు మెసేజ్‌లను క్లిక్ చేయవద్దని తెలుపుతూ ఆ అకౌంట్‌లో ఒక పోస్టును పెట్టారు. భారత్ వెంటనే దీనిపై స్పందించింది. అజిత్ దోవల్‌కు ఫేస్‌బుక్ అకౌంటే లేదని తేల్చిచెప్పింది. నకిలీ ప్రొఫైల్ అని వెల్లడించింది. ముజఫరాబాద్‌లో సుఖోయ్ 30ఎంకేఐ విమానం కూలిపోయిందని, అందులో ఒక భారతీయ పైలట్ సజీవంగా ఉన్నాడని పాకిస్థాన్ సోషల్ మీడియా హ్యాండిల్స్ ప్రచారానికి పూనుకున్నాయి. అయితే అది అవాస్తమని భారత్ తేల్చింది. భారత వైమానిక దళానికి చెందిన ఈ సుఖోయ్ 2014 అక్టోబర్14 మహారాష్ట్రలోని పూణే-అహ్మద్‌నగర్ హైవే సమీపంలోని కుల్వాడి గ్రామంలోని ఉంద్రేవస్తి వద్ద కూలిపోయింది. దానిని తాజా యుద్ధానికి సంబంధించిందంటూ పాక్ వక్రీకరించింది. దానిని పాక్ ఆర్మీ కూల్చినట్లుగా ప్రచారం చేసుకుంది. ఆ పోస్టును షేర్ చేయవద్దని భారత్ స్పష్టంచేసింది.

జమ్ము వైమానికదళ స్థావరంలో భారీగా వరుస పేలుళ్లు జరిగాయని కూడా పాక్ ప్రచారానికి తెరతీసింది. దాన్ని కూడా భారత్ తిప్పికొట్టింది. పాక్ ప్రచారం చేస్తున్న ఫొటో ఆగస్టు 2021లో కాబూల్ విమానాశ్రయంలో జరిగిన పేలుడుకు సంబంధించినదని బహిర్గతం చేసింది. తప్పుడు సమాచారంతో మోసపోవద్దని, కంటెంట్‌ను షేర్ చేసే ముందు వాస్తవాలను తెలుసుకోవాలని పౌరులకు సూచించింది. జలంధర్‌లో జరిగిన డ్రోన్ దాడికి సంబంధించిన వీడియోను ప్రజల్లో భయాందోళనలను సృష్టించడానికి విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

# విపక్షాల సమర్థతకు విషమ పరీక్ష !

పార్లమెంట్ మలివిడత బడ్జెట్ సమావేశాలు సోమవారం ప్రారంభం అయ్యాయి. దేశంలో ఉన్న సమస్సయల దృష్ట్యా ఈ సమావేశాలే కీలకం. ఈ సమావేశాల్లో ఏ అంశంపై చర్చించాలి..చర్చించకూడదు.. సభాసమయాన్ని సద్వినియోగం చేసుకోవడమెలా అన్నది కూడా విపక్ష కాంగ్రెస్ చతురతపై ఆధారపడి ఉంది. అలాగే విపక్షాలు కూడా సమర్థత ప్రదర్శించాల్సి ఉంది. కేవలం అల్లరి చేసి వాకట్లు చేయడమో. ప్రతిష్టంభనతో సభ వాయిదా వేయించడం వల్లనో సమస్యలు చర్చకు రావు. ఇది గమనించి కాంగ్రెస్ వ్యూహాత్మకంగా వ్యవహరించాల్సి ఉంది. లేకుంటే అది విపక్ష పార్టీగా విఫలం అయినట్లే. ప్రధానంగా డిటిమిటేషన్ భయాలు, జనగణన,జిఎస్టీ, నిరుద్యోగం, ఔషధధరలు, పెరుగుతున్న నిత్యావసర ధరలు వంటి ప్రధాన సమస్యలు దేశాన్ని పట్టిపీడిస్తున్నాయి. ప్రధానంగా ఇప్పుడు డీలిమిటేషన్‌పై సర్వత్రా చర్చ నడుస్తోంది. దక్షిణాది రాష్ట్రాల్లో జనాభా ప్రాతిపదికన సీట్లు తగ్గుతాయని ఆందోళన వ్యక్తం అవుతోంది. దీనిపై బిజెపి లేదా ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదు. తెలంగాణ బిజెపి నేతలు మాత్రం సీట్లు తగ్గవని అంటున్నారు. ఇంతకీ ఇప్పుడున్న సీట్లు తగ్గవా లేక, పెరిగే సీట్లు తగ్గవా అన్నది స్పష్టం చేయకుండా గోడవాటం పిల్లిలా వ్యవహరిస్తున్నారు. అమెరికా తరహాలోనే భారత్ కూడా ప్రజ్యాస్వామ్య వ్యవస్థ కలిగిన సమాఖ్య రాజ్యం. 1971లోని జనాభా నిష్పత్తి ప్రకారం ప్రాతినిధ్యం కల్పించడం వల్ల ఊహించని ప్రమాదాలు ఎదురవుతాయనే వాస్తవాన్ని గుర్తించాము. అయితే ఒక పరిష్కారాన్ని కనుగొనడానికి బదులు దాన్ని 2026 దాకా వాయిదా వేశాము. చివరి జనాభా గణన 2011లో జరిగింది. తదుపరి జనాభా గణన 2021లో జరగవలసి ఉండగా కోవిడ్ విలయం వల్ల వాయిదా వేశారు. 2021 నుంచి ఏదో ఒక సాకుతో జనాభా గణన జరగనే లేదు. తాజాగా కులగణన అంటూ కాంగ్రెస్ రాజకీయాలు మొదలు పెట్టింది. దీంతో సమాజంలో చీలిక తప్ప మరోటి రాదు. ఇది ఓ రకంగా అచ్చం రాజకీయ లబ్ధికోసం చేస్తున్న డిమాండ్ తప్ప మరోటి కాదు. ఈ క్రమంలో 2026లో జనాభా గణన అనంతరం విధిగా లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన జరగవలసి ఉన్నది. ప్రతి రాష్ట్రానికి కేటాయించే సీట్ల సంఖ్యను కూడా అప్పుడే నిర్ణయిస్తారు. జనాభా పెరుగుదల అదుపులేకుండా జరిగినందుకు కొన్ని రాష్ట్రాలకు ప్రయోజనాలు కల్పిస్తారు. సంపూర్ణ ప్రజనన రేటు 2 శాతం, అంతకంటే తక్కువగా ఉండాలన్న నిర్దేశిత లక్ష్యాన్ని సాధించిన రాష్ట్రాలను సీట్ల కుదింపుతో శిక్షించనున్నారన్న ప్రచారం సాగుతోంది. ఇలా కేవలం జనాభా ప్తరాపిదకిగా కాకుండా మధ్యేమార్గం అవలంబించాల్సిన అసవరం ఇప్పుడు కనిపిస్తోంది. పునర్విభజనతో దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయని తమిళనాడు సిఎం స్టాలిన్ పోరుబాట పట్టారు. జనాభా నిష్పత్తి సూత్రానికి అనుగుణంగా ఆయా రాష్ట్రాల సీట్ల సంఖ్యను పునర్ నిర్ధారించడం ద్వారా దక్షిణ్యాది రాష్ట్రాలకు నష్టటం జరగడం ఖాయంగా కనిపిస్తోంది. దక్షిణాది రాష్ట్రాల్లో ఇప్పుడు లోక్‌సభలో 129 స్థానాలున్నా వారి గళం పెద్దగా విన్పించడం లేదు.

ఇప్పుడా సీట్ల సంఖ్య మరింతగా తగ్గితే దక్షిణాది ప్రతినిధుల మాటను కేంద్రం పట్టించుకోదు.

సీట్ల సంఖ్య తగ్గించబోమనే హామీలో నిజాయితీ కొరవడింది. ఇదే సందర్భంలో జనాభా అత్యధికంగా ఉన్న యూపీ, బిహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌ల సీట్ల సంఖ్యను పెంచబోమని కేంద్రం స్పష్టంగా ప్రకటించడం లేదు. సీట్ల సంఖ్య పునర్ నిర్ధారణకు జనాభా నిష్పత్తి సూత్రాన్ని అనుసరించిన పక్షంలో దక్షిణాది రాష్ట్రాల బలం మరింతగా తగ్గిపోతుంది. పర్యవసానంగా పార్లమెంటులో దక్షిణాది వారి గళం వినిపించే వారి సంఖ్యా తగ్గుతుంది. ఈ రాష్ట్రాల సమస్యల పరిష్కారం పట్ల నిర్లక్ష్యం పెరుగుతంది.

# ఉపాధి రంగాలు బలోపేతం కావాలి

అమెరికాలో ఉన్నత చదువులు చదివిన భారతీయలు ఉద్యోగాలు లేక అక్కడ మగ్గుతున్నారు. మన దేశంలో ఉద్యోగాలు దక్కక ఎంతోమంది విదేశాలకు వెళ్లినా వారికి భరోసా దక్కడం లేదు. అటు ఉద్యోగాలు దొరక్క..బ్యాంకు రుణాలు కట్టలేక నానా అవస్థలు పడుతున్నారు. పోనీ దేశానికి వచ్చి ఇక్కడేమైనా చేద్దామా అంటే ఇక్కడా పరిస్థితి దారుణంగా ఉంది. దేశంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కనిపించడం లేదు. ఉన్న ఉద్యోగులను మెల్లగా తీసేస్తున్నారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం అనుసరి స్తున్న విధానాల ఫలితంగా నిరుద్యోగం పెరుగుతున్నది. అలాగే ప్రైవేట్ పెట్టుబడులు తగ్గుతున్నవి. ప్రభుత్వ ఉద్యోగాలకోసం యువత ఎదురుచూడటం ఈ మధ్యకాలంలో ఎక్కువవుతున్నది. ఇలాంటి తక్షణ, అత్యవసర సమస్యల పరిష్కారంపట్ల దృష్టిసారించాల్సిందిపోయి నిర్లిప్తంగా ఉంటున్నాయి. రాజకీయాలు నెరిపే పార్టీలు ప్రజా సంక్షేమం, అభివృద్ధి కేంద్రంగా వ్యవహరించాలి. ఈ క్రమంలో ముందు ఆర్థిక వ్యవస్థ బలపడాలి. తరవాత స్వయం ఉపాధి పథకాలు భారీగా చేపట్టాలి. కానీ కేంద్ర ప్రభుత్వం ఈ దిశంగా

చర్యలు తీసుకోవడం లేదు. ఆర్థిక మందగమనంపై దిద్దుబాటు చర్యలు తీసుకోవడం లేదు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే కొనసాగుతున్నా ముందే చర్యలు తీసుకుని ఉంటే కొంతయినా పరిస్థితి మెరుగు పడేది. నిజానికి మనది మిశ్రమ ఆర్థిక వ్యవస్థ. గ్రామీణ ఆర్థికరంగం బలోపేతం కావాలి. కానీ అలా జరగడం లేదు. కులవృత్తులకు ప్రోత్సాహం లేదు. వ్యవసాయం, దాని అనుబంధ రంగాలను బలోపేతం చేసే చర్యలు తీసుకోవడం లేదు. నిరుద్యోగులను గట్టెక్కించే చర్యలకు బదులు, పన్నుల వసూళ్లపైనే దృష్టి సారిస్తున్నారు. అలాగే జిఎస్టీ సవరణలకు పూనుకోవడం లేదు. దీంతో ఉద్యోగ,ఉపాధి రంగాలు తీవ్రంగా ప్రభావం చూపుతున్నాయి. గతంలోనే ఆర్‌బిఐ గవర్నర్‌గా ఉన్న రఘురామ్ రాజన్ అనేక హెచ్చరికలు చేసినా పట్టించుకోక పోవడం వల్ల ఈ దుస్థితి ఏర్పడిందనే చెప్పాలి.

# ఎప్ సెట్‌లో "కాకతీయ"కు ఉత్తమ ర్యాంకులు.

## విద్యార్థులను అభినందించిన విద్య సంస్థల చైర్మన్ విజయలక్ష్మి.




**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మే 11:**

తెలంగాణ ఎప్ సెట్ 2025 ఫలితాలలో జిల్లా కేంద్రంలో గల కాకతీయ కళాశాల విద్యార్థులు తొలి ప్రయత్నంలో అత్యుత్తమంగా రాష్ట్ర, జిల్లా స్థాయి ర్యాంకులు సాధించారని కాకతీయ విద్యాసంస్థల చైర్ పర్సన్ విజయలక్ష్మి తెలిపారు. ఇటీవల ఇంటర్ ఫలితాలలో రాష్ట్రస్థాయిలో మార్కులు సాధించిన విద్యార్థులు తొలి ప్రయత్నంలోనే ( లాంగ్ టర్మ్ కోచింగ్ ) లేకుండా డైరెక్ట్ ఎప్ సెట్ కు హాజరై మంచి ర్యాంకులు సాధించారని పేర్కొన్నారు. ఆదివారం వెలువడిన ఫలితాలలో కాకతీయకు చెందిన విద్యార్థులు అనాస్ ఆలీ 1766 వ ర్యాంక్, ఎం. సంకేత్ 2398, జి, వేదాక్షర్ 2881, భవ్య శ్రీ 3310, యం. లోకేష్ 3671, ఎ వైష్ణవి 4172, జి రిషీక్ 5932, వి. నికేతన్ 6293 ర్యాంకులు సాధించగా వారిని అభినంధించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ లు, ప్రిన్సిపాల్స్ సందిప్, రణదిష్ శర్మ, వైస్ ప్రిన్సిపాల్ శ్యాం, కాకతీయ కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ రాజేంద్రప్రసాద్ కు "విస్సాహెల్త్ ఎక్స్" పురస్కారం.

## మంత్రులు శ్రీధర్ బాబు, సీతక్కల చేతుల మీదుగా అవార్డు ప్రధానం.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మే 11:**






నగరానికి చెందిన ప్రముఖ వైద్యులు, శ్రీ విష్ణు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ రాజేంద్రప్రసాద్ అందిస్తున్న ఉత్తమ వైద్య సేవలను గుర్తించి రాజ్ న్యూస్ ఆయనను "విస్సా హెల్త్ ఎక్స్" పురస్కారానికి ఎంపిక చేసింది. హైదరాబాదులో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ రాజేంద్రప్రసాద్ విస్సా హెల్త్ ఎక్స్ పురస్కారం అందుకున్నారు. ఈ కార్యక్రమానికి అతిధులుగా హాజరైన రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, సీతక్కలు డాక్టర్ రాజేంద్రప్రసాద్ కు పురస్కారాన్ని అందజేసి అభినందించారు. రాజ్ న్యూస్ అందజేసిన విస్సా హెల్త్ ఎక్స్ పురస్కారం తన బాధ్యతను మరింత పెంచిందని ఈ సందర్భంగా అవార్డు గ్రహీత డాక్టర్ రాజేంద్రప్రసాద్ చెప్పారు. మరింత ఉత్సాహంతో ప్రజలకు ఉత్తమ వైద్య సేవలను అందజేస్తానని ఆయన పేర్కొన్నారు.

# సైనికుల క్షేమం కోసం ఎంపీ అరవింద్ పూజలు.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మే 11:**



సరిహద్దుల్లో దేశంకోసం నిరంతరం శ్రమిస్తున్న సైనికుల ఆరోగ్యం, విజయం కోసం దేవుణ్ణి ప్రార్థించామని ఎంపీ అర్వింద్ అన్నారు. బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు "మనం సైతం దేశం కోసం" కార్యక్రమంలో భాగంగా ఆదివారం సారంగాపూర్ హనుమాన్ మందిరంలో ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఎంపీ అర్వింద్ మాట్లాడుతూ, పాక్ కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘన ప్రతి ఒక్కరు చూశారన్నారు. ఇది జాతీయ భద్రతకు సంబంధించినదిగా పరిగణిస్తున్నామన్నారు. పాక్ దేశం అంతర్గతంగా విభజించబడి ఉందన్నారు. కొంతమంది టెర్రరిస్ట్ లకు మద్దతు ఇస్తున్నారని ఆరోపించారు. ఈకార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి, పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, నాయకులు, పాల్గొన్నారు.

# "సువిద ఆశ్రమం" ప్రారంభించిన అర్బన్ ఎమ్మెల్యే.





## అద్దె ఇళ్లల్లో ఉండే ఆర్యవైశ్యుల సౌకర్యం కోసం ఏర్పాటు.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మే 11:**

ఆర్యవైశ్య పట్టణ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన నూతన దుకాణ సముదాయం, సువిద ఆశ్రమంను ఆదివారం అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ గుప్తా ప్రారంభించారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతు, సొంత ఇల్లు లేకుండా కిరాయి ఇళ్లలో నివసించే ఆర్యవైశ్య కుటుంబాలలో ఎవరైనా చనిపోతే వారికీ ఎటువంటి ఇబ్బందులు లేకుండా అంత్యక్రియల నుండి దశ దిన కర్మ వరకు ఉచితంగా సువిద ఆశ్రమంలో ఆశ్రయం కల్పించడం జరుగుతుందని అన్నారు. నూతన దుకాణ సముదయానికి మరియు సువిద ఆశ్రమం నిర్మాణానికి సహకరించిన ఆర్య వైశ్య పెద్దలను అభినందించారు. ఆర్య వైశ్యులు హిందూ ధర్మ రక్షణ, సేవ కార్యక్రమాలతో పాటు రాజకీయంగా కూడా ఎదగాలని పేర్కొన్నారు. భారత్ - పాకిస్తాన్ మధ్య జరుగుతున్నా యుద్ధపరిణామాల్లో భాగంగా ప్రతి ఒక్కరు భారత్ సైన్యానికి మనోధైర్యాన్ని, ఆయురారోగ్యాలను ప్రసాదించాలని నిత్య పూజలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్య వైశ్య పట్టణ సంఘం అధ్యక్షులు కొండా వీరశేఖర్ గుప్త, కాసుబ సంపత్ కుమార్ గుప్తా, కాపర్తి వెంకటేష్ గుప్తా, మామిడి రాజేందర్ గుప్తా, దొంతుల రాజా ప్రతాప్, ఇల్లందుల ప్రభాకర్, ఆర్య వైశ్య సంఘం కార్యవర్గం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# వినయ్ రెడ్డి రక్తదానం.

**వేగుచుక్క న్యూస్, ఆర్మూర్, మే 11:**



అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్ లోని మల్లరెడ్డి నారాయణ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జగడం నారాయణ (జక్రానపల్లి ) బి నెగిటివ్ రక్తం అవసరం ఉండగా సామాజిక మాధ్యమంలో పోస్ట్ చేసిన వెంటనే స్పందించి హాస్పిటల్ కి వెళ్లిన కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్చార్జి వినయ్ కుమార్ రెడ్డి రక్తం దానం చేశారు.

# దత్త గుడిలో అర్బన్ ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు.

## యుద్ధంలో భారత త్రివిధ దళాల సైన్యానికి మనోధైర్యం ప్రసాదించాలని వేడుకోలు.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మే 11:**





ఇండియా - పాకిస్తాన్ మధ్య జరుగుతున్నా యుద్ధం నేపథ్యంలో భారత త్రివిధ దళాల సైన్యానికి మనోధైర్యం ప్రసాదించాలని, భారత భూబాగానికి, దేశ ప్రజలకు ఎటువంటి నష్టం జరగకూడదని ఈ యుద్ధంలో భారత్ ఘన విజయం సాధించాలని అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ ఆదివారం మల్లారం దత్త గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతు, ఈ యుద్ధంలో భారత్ సైన్యనికి, భారత భూబాగానికి, దేశ ప్రజలకు ఎటువంటి నష్టం జరగకుండా కుల, మతాలకు అతీతంగా ప్రతి భారతీయుడు దగ్గర్లో ఉన్న మందిరాలలో ప్రత్యేక పూజలు నిర్వహించాలని అన్నారు. కాశ్మీర్ లో పహాల్గం ఘటన తరువాత ప్రతి భారతీయునిలో మరిగిన రక్తనికి, ఆవేదనకు ప్రతీకారంగా ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్ కు తగిన గుణపాఠం చెప్పడానికి భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ నిర్వహించడం అనేది భారత్ శక్తి యుక్తుల కు నిదర్శనం అన్నారు. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్నా పాకిస్తాన్ భారత్ చర్యను భరించలేక భారత దేశంపైన, మన పౌరులపైన దాడులకు పాల్పడటాన్ని భారత్ త్రివిధ దళాలు సమర్థవంతంగా తిప్పికొడుతున్నాయన్నారు. కాల్పుల విరమణ ఒప్పందం చేసుకొని మళ్ళీ భారత్ పై దాడులు చేయడం పాకిస్తాన్ వంకర బుద్ధి, ప్రపంచదేశాలకు స్పష్టం అయిందన్నారు. ఉగ్రవాదానికి మద్దతు ఇస్తూ భారత్ పైన దాడి చేసే శత్రు దేశాలకు భారత్ సైన్యం తగిన బుద్ధి చెప్తుందని అన్నారు. భారత్ సైన్యం తలుచుకుంటే పాకిస్తాన్ ను ఇండియా పఠంలో లేకుండా చేస్తుందని భారత దేశ ప్రజలందరు కేంద్రప్రభుత్వానికి అండగా ఉన్నారన్నారు.

# ఇప్పటికీ పాత పన్ను విధానంలో అదిరిపోయే బెనిఫిట్స్..

పూర్ణచందర్ మధ్యతరగతి వర్గం, వేతన జీవులకు ఊరట కలిగించేలా ఇటీవల బడ్జెట్‌లో ఆదాయపు పన్నుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటనలు చేసిన సంగతి తెలిసిందే. ముఖ్యంగా కొత్త పన్ను విధానంలో రూ. 12 లక్షల వరకు టాక్స్ లేదని స్పష్టం చేసింది. వేతన జీవులకు ఈ పరిమితి రూ. 12.75 లక్షల వరకు ఉంటుంది. అయితే ఇప్పటికీ పాత పన్ను విధానంలో చాలా బెనిఫిట్స్ ఉన్నాయి. అవేంటో తెలుసుకుందాం.



2025 బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం ఇటీవల కీలక ప్రకటనలు చేసిన సంగతి తెలిసిందే. ఇందులో ముఖ్యంగా ఆదాయపు పన్ను విధానానికి సంబంధించి మధ్యతరగతి వర్గానికి అదిరిపోయే శుభవార్త చెప్పిందని చెప్పొచ్చు. పాత పన్ను విధానంలో ఎలాంటి మార్పులు చేయకుండా.. ఇదే సమయంలో కొత్త పన్ను విధానంలో టాక్స్ రిబేట్ రూ. 12 లక్షలకు పెంచింది. సెక్షన్ 87కింద ఈ టాక్స్ రిబేట్ వర్తిస్తుంది. ఇంకా వేతన జీవులకు అదనంగా రూ. 75 వేలు స్టాండర్డ్ డిడక్షన్ పొందే సదుపాయం ఉంటుంది. అంటే.. వీరు రూ. 12.75 లక్షల వరకు టాక్స్ చెల్లించా ల్సిన అవసరం లేదు. ఇదే సమయంలో కొత్త పన్ను విధానంలో శ్లాబుల్ని కూడా సవరిం చింది. దీని ద్వారా కూడా టాక్స్‌పేయర్లు బెనిఫిట్స్ పొందొచ్చు.

గత కొంత కాలంగా కొత్త పన్ను విధానాన్ని మరింత ఆకర్షణీయంగా మార్చాలని కేంద్ర ప్రభుత్వం చూస్తోంది. ఇందులో భాగంగానే పాత పన్ను విధానంలో ఎలాంటి మార్పులు ప్రకటించకుండా.. కొత్త పన్ను విధానంలో ఊరట కల్పిస్తూ.. డిఫాల్ట్ టాక్స్ రెజిమ్‌గా తీసుకొచ్చింది. ఇక 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి దాదాపు 74 శాతం టాక్స్ పేయర్లు కొత్త పన్ను విధానం కిందనే ఐటీ రిటర్న్లు దాఖలు చేశారు. అయితే.. ఇప్పుడు కొత్తగా తీసుకొచ్చిన మార్పులతో దాదాపు 90 శాతం మంది వరకు కొత్త పన్ను విధానానికే మొగ్గుచూపే అవకాశం ఉంటుందని అంచనా వేశారు సీబీడీటీ ఛైర్‌పర్సన్ రవి అగర్వాల్. అయితే..

> రూ. 12 లక్షల వరకు ఆదాయంపై టాక్స్ లేదు కాబట్టి కొత్త పన్ను విధానం ఇక్కడి వరకు ఓకే.. అయితే రూ. 12 లక్షలకుపైబడిన ఆదాయంపై అన్ని శ్లాబుల ప్రకారం టాక్స్ పడుతుంది. ఇక్కడే పాత పన్ను విధానంలో కొన్ని బెనిఫిట్స్ ఉన్నాయి. ఇందులో బోలెడన్నీ టాక్స్ డిడక్షన్స్,

ఇప్పటికీ పాత పన్ను విధానం కొందరికి ఆకర్షణీయంగా ఉంటుంది. అందులో ఉన్న బెనిఫిట్స్ ఏంటో చూద్దాం.

రూ. 12 లక్షల వరకు ఆదాయంపై టాక్స్ లేదు కాబట్టి కొత్త పన్ను విధానం ఇక్కడి వరకు ఓకే.. అయితే రూ. 12 లక్షలకుపైబడిన ఆదాయంపై అన్ని శ్లాబుల ప్రకారం టాక్స్ పడుతుంది. ఇక్కడే పాత పన్ను విధానంలో కొన్ని బెనిఫిట్స్ ఉన్నాయి. ఇందులో బోలెడన్నీ టాక్స్ డిడక్షన్స్, ఎగ్జెంప్షన్స్ ఉన్నాయని గుర్తించాలి. ఇక్కడ పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్, సుకన్య సమృద్ధి యోజన వంటి పలు పథకాల్లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా ఆర్థిక సంవత్సరంలో గరిష్టంగా రూ. 1.50 లక్షల వరకు టాక్స్ ఆదా చేసుకోవచ్చు. పాత పన్ను విధానంలో హౌస్ రెంట్ అలవెన్స్ కూడా ఆదా చేసుకో వచ్చు. ఇది బేసిక్ శాలరీపై ఆధారపడి ఉంటుంది. బేసిక్ శాలరీలో సగం వరకు హెచ్‌ఆర్ఏ కింద పన్ను తగ్గించుకునే వెసులు బాటు ఉంది. ఇంకా రూ. 15 లక్షలకుపైగా ఆదాయం ఉన్నప్పుడు.. పాత పన్ను విధానం లోనే అన్ని టాక్స్ ఎగ్జెంప్షన్స్, డిడక్షన్స్ ఉన్నట్లయితే పన్ను తక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇక్కడా స్టాండర్డ్ డిడక్షన్ కింద రూ. 50 వేలు పన్ను తగ్గించుకోవచ్చు. హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియంలపై గరిష్టంగా రూ. 75 వేల వరకుబీ అదే విధంగా హోం లోన్ వడ్డీపై రూ. 2 లక్షల వరకు మినహాయింపు ఉంటుంది. కింద రూ. 50 వేలు సహా ఇలా పెద్ద మొత్తంలో పన్ను వర్తించే ఆదాయం నుంచి తగ్గించుకొని ప్రయోజనం పొందొచ్చు. ఈ డిడక్షన్స్, పెట్టుబడులు ఉన్నవారు.. టాక్స్ తగ్గించుకునేందుకు ఇప్పటికీ పాత పన్ను విధానంవైపే చూస్తున్నారు.

# సేవింగ్స్ అకౌంట్లపై వడ్డీ రేట్లు పెంపు..



రిజర్వ్ బ్యాంక్ ఇటీవల రెపో రేట్లు తగ్గించిన నేపథ్యంలో.. ఇప్పుడు చాలా బ్యాంకులు ఫిక్స్‌డ్ డిపాజిట్ వడ్డీ రేట్లను తగ్గించే అవకాశం ఉంది. ఇదే సమయంలో ఇప్పుడు ఒక ప్రముఖ బ్యాంక్ సేవింగ్స్ అకౌంట్ వడ్డీ రేట్లను పెంచుతున్నట్లు వెల్లడించింది. ఎంత బ్యాలెన్స్ ఉంటే వడ్డీ ఎలా ఉంటుందనేది మనం ఇప్పుడు తెలుసుకుందాం.

సాధారణంగా బ్యాంకులు.. ఫిక్స్‌డ్ డిపాజిట్లపై మాత్రమే వడ్డీ రేట్లు ఆఫర్ చేస్తాయని అంతా అనుకుంటారు. అదే సేవింగ్స్ అకౌంట్లపై వడ్డీ రేట్ల గురించి చాలా మందికి తెలిసుండకపోవచ్చు. అవును.. సేవింగ్స్ అకౌంట్లపై వడ్డీ అంటే.. మీ బ్యాంక్ అకౌంట్లో ఉన్న డబ్బులపైనా బ్యాంకులు వడ్డీ చెల్లిస్తుంటాయి. ఇది మీరు మెయింటెయిన్ చేసే బ్యాంక్ బ్యాలెన్స్‌పై ఆధారపడి ఉంటుందని చెప్పొచ్చు. నెలవారీగా సగటున ఇంత బ్యాలెన్స్ ఉంటే.. ఇంత శాతం అని ఉంటాయి. ఇది అన్ని బ్యాంకుల్లో ఒకేలా ఉండదు. బ్యాంకుల్ని బట్టి వడ్డీ రేట్లు మారుతుంటాయి. ఇప్పుడు ప్రైవేట్ రంగానికి చెందిన ప్రముఖ బ్యాంకుల్లో ఒకటైన.. ఆర్‌బీఎల్ బ్యాంకు శుభవార్త చెప్పింది. సేవింగ్స్ అకౌంట్లలో వడ్డీ రేట్లకు సంబంధించి కీలక మార్పులు ప్రకటించింది. ఇది 2025, ఫిబ్రవరి 15 నుంచి అమల్లోకి వస్తుందని స్పష్టం చేసింది. రివైజ్డ్ వడ్డీ రేట్లను బ్యాంక్ తన అధికారిక వెబ్‌సైట్‌లో పేర్కొంది.

ఈ బ్యాంకు తాజాగా ఎంపిక చేసిన కొన్ని బ్యాలెన్స్‌లపై వడ్డీ రేట్లను గరిష్ఠంగా 50 బేసిస్ పాయింట్ల వరకు పెంచగా.. ఇదే సమయంలో చిన్న మొత్తాల్లో బ్యాలెన్స్ నిర్వహించే వారికి మాత్రం 25 బేసిస్ పాయింట్ల వరకు వడ్డీ రేట్లు తగ్గించినట్లు తెలిపింది. అకౌంట్లో

రూ. 10 లక్షల నుంచి రూ. 25 లక్షల వరకు బ్యాలెన్స్ మెయింటెయిన్ చేసే వారికి 50 బేసిస్ పాయింట్ల మేర వడ్డీ రేటు పెరిగింది. అంతకుముందు 6 శాతంగా ఉండగా.. ఇప్పుడు 6.50 శాతం అందుతోంది. ఇక రూ. 50 కోట్ల నుంచి రూ. 75 కోట్ల వరకు వారికి వడ్డీ రేట్లు 75 బేసిస్ పాయింట్ల మేర పెరగ్గా ఇప్పుడు 6 శాతం వడ్డీ అందుతోంది.

రూ. లక్ష వరకు బ్యాలెన్స్ మెయింటెయిన్ చేసే వారికి అంతకుముందు 3.50 శాతం వడ్డీ అందేది. ఇప్పుడు అది 25 బేసిస్ పాయింట్లు తగ్గి 3.25 శాతానికి చేరింది. రూ. లక్ష నుంచి 5 లక్షల వరకు బ్యాలెన్స్ ఉన్న వారికి ఏకంగా ఒక శాతం వడ్డీ రేటు తగ్గింది.

> అకౌంట్లో రూ. 10 లక్షల నుంచి రూ. 25 లక్షల వరకు బ్యాలెన్స్ మెయింటెయిన్ చేసే వారికి 50 బేసిస్ పాయింట్ల మేర వడ్డీ రేటు పెరిగింది. అంతకుముందు 6 శాతంగా ఉండగా.. ఇప్పుడు 6.50 శాతం అందుతోంది. ఇక రూ. 50 కోట్ల నుంచి రూ. 75 కోట్ల వరకు వారికి వడ్డీ రేట్లు 75 బేసిస్ పాయింట్ల మేర పెరగ్గా ఇప్పుడు 6 శాతం వడ్డీ అందుతోంది.రూ. లక్ష వరకు బ్యాలెన్స్ మెయింటె యిన్ చేసే వారికి అంతకుముందు 3.50 శాతం వడ్డీ అందేది. ఇప్పుడు అది 25 బేసిస్ పాయింట్లు తగ్గి 3.25 శాతానికి చేరింది.

అంతకుముందు ఇది 5.50 శాతంగా ఉండగా.. ఇప్పుడు 4.50 శాతానికి దిగొచ్చింది. రూ. 5-10 లక్షలపై మాత్రం 5.50 శాతంగానే స్థిరంగా ఉంది.

రూ. 10-25 లక్షల బ్యాలెన్స్‌లపై 6 శాతం నుంచి 6.50 శాతానికి పెరిగింది. రూ. 25 లక్షల నుంచి రూ. 3 కోట్ల వరకు బ్యాలెన్స్ నిర్వహిస్తే వారికి 7.50 శాతం వడ్డీ ఆఫర్ చేస్తోంది బ్యాంకు. రూ. 5 లక్షల వరకు అకౌంట్లో మెయింటెయిన్ చేసే వారికి మాత్రం వడ్డీ రేటు అంతకుముందుకంటే తగ్గిందని చెప్పొచ్చు.

వేగుచుక్క

# థగ్ లైఫ్ ఈవెంట్ వాయిదా..



థగ్ లైఫ్ మూవీ ప్రమోషన్స్‌ను కమల్ హాసన్ భుజానికి ఎత్తుకున్నాడు. కమల్ హాసన్‌తో పాటుగా శింబు కూడా ఎక్కువగా ప్రమోషన్స్ చేస్తున్నాడు. రీసెంట్‌గానే కమల్ హాసన్ తెలుగులోని కొన్ని యూట్యూబ్ చానెళ్లు, మీడియాతో ముచ్చటించాడు. అయితే తాజాగా థగ్ లైఫ్ ఆడియో కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్టుగా కమల్ హాసన్ తెలిపాడు.ప్రస్తుతం దేశంలో ఉన్న పరిస్థితుల దృష్ట్యా ఈ నిర్ణయాన్ని తీసుకున్నట్టు చెప్పుకొచ్చాడు. మళ్లీ తదుపరి తేదీని ప్రకటిస్తామని అన్నాడు.

కమల్ హాసన్, మణిరత్నం కాంబోలో గతంలో నాయగన్ వంటి క్లాస్ హిట్ వచ్చింది. ఇక ఇన్నేళ్లకు మళ్లీ ఈ ఇద్దరూ కలిసి థగ్ లైఫ్ అంటూ రాబోతోన్నారు. జూన్ 5న ఈ చిత్రాన్ని రిలీజ్ చేయబోతోన్నారు. ఈ మూవీలో త్రిష హీరోయిన్‌గా నటిస్తోంది. శింబు మరో ముఖ్య పాత్రను పోషిస్తున్నాడు. ఇప్పటికే జింగుచా అనే పాటను విడుదల చేసి మ్యూజికల్ ప్రమోషన్స్‌ను స్టార్ట్ చేశాడు. ఇక థగ్ లైఫ్ ప్రమోషన్స్‌లో కమల్ హాసన్ ముందు నుంచీ ఫుల్ జోష్‌తో పాల్గొంటున్నాడు.

కమల్ హాసన్ నిర్మాణంలో థగ్ లైఫ్ రాబోతోంది. ఇక ఈ మూవీ ప్రమోషన్స్ కోసం తెలుగులోని కొన్ని చానెళ్లకు ఇంటర్వ్యూలు కూడా ఇచ్చాడు కమల్ హాసన్. అయితే ప్రస్తుతం దేశంలో నెలకొన్న యుద్ధ పరిస్థితుల గురించి తెలిసిందే. ఇండియా, పాక్ మధ్య ఎలాంటి భీకర వాతావరణం నెలకొందో చూస్తూనే ఉన్నారు. ఇలాంటి తరుణంలో తన థగ్ లైఫ్ ఆడియో కార్యక్రమం జరపడం సరి కాదని కమల్ హాసన్ భావించాడు.

ప్రస్తుతం మన కోసం మన సైనికులు పోరాడుతున్నారని, అలాంటి తరుణంలో మనం ఇక్కడ ఆడియో ఈవెంట్ అని సంబరాలు చేసుకోవడం కరెక్ట్ కాదని అన్నాడు. 16వ తేదీన జరగాల్సిన ఈ ఈవెంట్‌ను పోస్ట్ పోన్ చేస్తున్నాను. ఇక త్వరలోనే కొత్త డేట్‌ను ప్రకటిస్తాం.. మళ్లీ పరిస్థితులు చక్కబడిన తరువాత ఈ ఈవెంట్‌ను చేసుకుందాం అని కమల్ హాసన్ ట్వీట్ వేశాడు.

# ప్రభాస్, ఎన్టీఆర్ ఫ్యాన్ వార్..



సోషల్ మీడియాలో అభిమానుల మధ్య జరుగుతున్న ఫ్యాన్ వార్స్ శృతి మించుతున్నాయి. హీరోల వ్యక్తిగత జీవితాలను కించపరిచేలా, మత విద్వేషాలు రెచ్చగొట్టేలా పోస్టులు పెడుతున్నారు.. తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. లేటెస్టుగా ప్రభాస్, ఎన్టీఆర్ అభిమానుల మధ్య జరుగుతున్న సోషల్ మీడియా వార్స్ ఇప్పుడు దేశవ్యాప్తంగా ట్రెండ్ అవుతున్నాయి. 'మహమ్మద్ షరీబ్ రసూల్ ఖాన్' 'ప్రభుదాస్ పాల్' ట్యాగ్స్ తో ఒకరినొకరు విమర్శించుకుంటున్నారు. 'ఆపరేషన్ సిందూర్' జరుగుతున్న సమయంలో ఇలాంటి చవకబారు చర్యలు సరికాదని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు.

ఇటీవల కాలంలో సోషల్ మీడియాలో పాజిటివిటీ కంటే నెగెటివిటీ ఎక్కువగా కనిపిస్తోంది. ఒకరిపై ఒకరు ట్రోల్స్, విద్వేషాలు రెచ్చగొట్టుకోవడం ఎక్కువైపోయింది. ఒకప్పుడు థియేటర్ల దగ్గర గొడవలు పడి తలలు పగలగొట్టుకునే సినీ అభిమానులు.. ఇప్పుడు ఆన్ లైన్ లో ఘర్షణ పడుతున్నారు. మా హీరో గొప్ప అంటే.. కాదు మా హీరో గ్రేట్ అంటూ ఫ్యాన్ వార్స్ చేసుకుంటున్నారు. అసభ్యకరమైన పదజాలంతో, అభ్యంతరకరమైన పోస్టులతో విమర్శించుకుంటున్నారు. తమ అభిమాన హీరోల వ్యక్తిగత జీవితాలను కూడా రోడ్డున పెడుతున్నారు.

టాలీవుడ్ స్టార్ హీరోలైన ప్రభాస్, మహేష్ బాబు, జూనియర్ ఎన్టీఆర్, అల్లు అర్జున్, పవన్ కళ్యాణ్, రామ్ చరణ్ అభిమానుల మధ్య తరచుగా ఫ్యాన్ వార్స్ జరగడం మనం చూస్తుంటాం. డైలీ ఎవరో ఒకరి మీద నెగెటివ్ హ్యాష్ ట్యాగ్స్ క్రియేట్ చేసి సోషల్ మీడియాలో ట్రెండ్ చేస్తున్నారు. లేటెస్టుగా ఎన్టీఆర్ - ప్రభాస్ ఫ్యాన్స్ మధ్య సోషల్ మీడియా వార్ హద్దులు దాటేస్తుంది. రెండు వర్గాలుగా విడిపోయి దారుణమైన కామెంట్స్ చేసుకుంటున్నారు. ఈ క్రమంలో పర్సనల్ లైఫ్ గురించి, మతాల గురించి కూడా ట్రోల్స్ చేసుకుంటున్నారు.

'ఆపరేషన్ సిందూర్' 'పహల్గాం' టైటిల్స్ కోసం పోటీ పడుతున్న అగ్ర నిర్మాతలు ఇప్పుడు సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా 'మహమ్మద్ షరీబ్ రసూల్ ఖాన్' 'ప్రభుదాస్ పాల్' గురించే పోస్టులు కనిపిస్తున్నాయి. గత రెండు రోజులుగా ఈ ట్యాగ్స్ ట్విట్టర్ లో నేషనల్ వైడ్‌గా ట్రెండ్ అవుతున్నాయి. పేర్లు చూసి పాకిస్తాన్ తీవ్రవాదులకు సంబంధించిన వార్తలు అనుకొని ఓపెన్ చేస్తే.. ఇదంతా మనోళ్ల పనితనం అని అర్థమవుతోంది. మహమ్మద్ షరీబ్ రసూల్ ఖాన్ అంటూ తారక్‌ని ట్రోల్ చేస్తుంటే.. ప్రభుదాస్ పాల్ అని ప్రభాస్‌ను ట్రోల్ చేస్తున్నారు.

# సింగిల్స్‌కు పాజిటివ్ టాక్..





అల్లు అర్జున్ తాజాగా స్పందిస్తూ సింగిల్స్ మూవీ గురించి మాట్లాడాడు. శ్రీ విష్ణు హీరోగా గీతా ఆర్ట్స్ తీసిన ఈ చిత్రానికి పాజిటివ్ టాక్ వచ్చింది. దీంతో బన్నీ సంతోషాన్ని వ్యక్తం చేశాడు. సింగిల్స్ చిత్రయూనిట్‌కు బన్నీ కంగ్రాట్స్ తెలిపాడు. షో రన్నర్, ఎంటర్టైన్మెంట్ ఇచ్చిన శ్రీవిష్ణు, వెన్నెల కిషోర్‌లకు ఆల్ ది బెస్ట్ తెలిపాడు. ఇక అసలే యుద్ధ వాతావరణం ఉండటంతో సినిమా కలెక్షన్లపై ప్రభావం కనిపించేలా ఉంది.

శ్రీ విష్ణు ప్రస్తుతం ఎంటర్టైన్మెంట్‌కి కేరాఫ్ అడ్రస్‌గా మారిపోయాడు. సామజవరగమన నుంచి శ్రీ విష్ణుకి సపరేట్ ఫ్యాన్ బేస్ ఏర్పడింది. ఆ తరువాత ఓం భీం బుష్, శ్వాగ్ వంటి చిత్రాలతో ఆడియెన్స్ ముందుకు వచ్చాడు. అవి కమర్షియల్‌గా అంత సక్సెస్ కాలేదు. ఇక ఇప్పుడు మళ్లీ తనకు కలిసి వచ్చిన ఎంటర్టైన్మెంట్ జానర్‌ను ఎంచుకున్నాడు శ్రీ విష్ణు. చసింగిల్ అనే సినిమాతో మే 9న ఆడియెన్స్ ముందుకు వచ్చాడు. ఆల్రెడీ ప్రమోషన్స్‌లో శ్రీ విష్ణు దూసుకుపోయాడు.

సింగిల్ చిత్రానికి ఇప్పుడు పాజిటివ్, మౌత్ టాక్ వచ్చేసింది. మూవీ ఆద్యంతం వినోదాత్మకంగా ఉందని అంతా అంటున్నారు. మళ్లీ ఎప్పటిలానే శ్రీ విష్ణు అదరగొట్టేశాడు. ఇక ఈ చిత్రానికి బన్నీ ఆల్ ది బెస్ట్ తెలిపాడు. తన కజిన్ విద్యకి బన్నీ ఆల్ ది బెస్ట్ తెలిపాడు. శ్రీ విష్ణుకి ఆల్ ది బెస్ట్.. ఇవానా, కేతికలకు బిగ్ చీర్స్, షో రాకర్ వెన్నెల కిషోర్‌కు ఆల్ ది బెస్ట్ అని బన్నీ ట్వీట్ వేశాడు. అయితే ఈ సింగిల్ మూవీకి ఆల్రెడీ పాజిటివ్ టాక్ వచ్చిన సంగతి తెలిసిందే.

శ్రీ విష్ణు సింగిల్ సినిమాతో మళ్లీ అందరినీ నవ్వించాడు. చాలా రోజులకు మళ్లీ థియేటర్లో హాయిగా అందరూ నవ్వుకుంటున్నారు. సామజ వరగమన రేంజ్‌ను మించేలా ఇందులో ఎంటర్టైన్ చేశాడు. ఫ్యామిలీ, యూత్ ఇలా అన్ని వర్గాల ఆడియెన్స్‌ను మెప్పించేలా ఈ చిత్రం ఉంది. చూస్తుంటే ఈ వీకెండ్‌కి సింగిల్ బాగానే సందడి చేసేలా కనిపిస్తోంది. శ్రీ విష్ణుకి మళ్లీ ఓ మంచి హిట్ పడేట్టుగా కనిపిస్తోంది. ఇవానా, కేతికలు కూడా ఈ హిట్టు మంచి మైలేజ్ దక్కించుకునేలా ఉన్నారు. ఇక ఎప్పటిలానే వెన్నెల కిషోర్ ఉంటే సినిమా బ్లాక్ బస్టర్ హిట్టే అని అంతా ఫిక్స్ అవుతున్నారు. గీతా ఆర్ట్స్ బ్యానర్ నుంచి సినిమా వస్తే గురి తప్పదని మరోసారి నిరూపించారు.

# హీరోకి యాక్సిడెంట్ జరిగితే సినిమాకి పాపులారిటీ

శ్రీవిష్ణు హీరోగా నటించిన తాజా చిత్రం 'చసింగిల్'. అల్లు అరవింద్ సమర్పణలో విద్యా కొప్పినీడి నిర్మించిన ఈ సినిమాలో కేతిక శర్మ, ఇవానా హీరోయిన్లుగా నటించారు. వెన్నెల కిషోర్ కీలక పాత్రలో కనిపించారు. కార్తీక్ రాజు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ కామెడీ ఎంటర్టైనర్ మే 9న థియేటర్లలో విడుదలైంది. ఈ సినిమాకు ఆడియన్స్ నుంచి పాజిటివ్ టాక్ వస్తోంది. అయితే ఈ సినిమాలోని ఓ సన్నివేశం చిత్రీకరిస్తున్న జరిగిన విషయాన్ని శ్రీ విష్ణు వెల్లడించగా.. దీనిపై అల్లు అరవింద్ ఫన్నీ కామెంట్స్ చేశారు.

టాలీవుడ్ లో కామెడీ సినిమాలతో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న హీరో శ్రీవిష్ణు. అందుకే అతన్ని సినీ అభిమానులు 'కింగ్ ఆఫ్ ఎంటర్టైన్మెంట్' అని పిలుచుకుంటున్నారు. గతేడాది 'స్వాగ్' చిత్రంతో మిశ్రమ స్పందన అందుకున్న శ్రీవిష్ణు.. ఇప్పుడు తనకు కలిసొచ్చిన జోనర్ లో "చసింగిల్" అంటూ ప్రేక్షకుల ముందుకు వచ్చారు. శుక్రవారం (మే 9) థియేటర్లలో రిలీజైన ఈ చిత్రానికి పాజిటివ్ టాక్ వచ్చింది. రివ్యూలు కూడా బాగున్నాయి. ఇక ఈ సినిమాలో ఆయన ఓ సన్నివేశంలో బ్రేక్స్ లేని బైక్ తో స్టంట్ చేసినట్లుగా తెలుస్తోంది.

మెగా ప్రొడ్యూసర్ అల్లు అరవింద్ సమర్పణలో 'చసింగిల్' మూవీ తెరకెక్కింది. రిలీజ్ డేట్ అనౌన్స్ చేసినప్పటి నుంచీ చిత్ర యూనిట్ చాలా అగ్రెసివ్ గా ప్రమోషన్స్ చేసారు. టీజర్, ట్రైలర్ కూడా జనాల దృష్టిని ఆకర్షించాయి. విడుదలకు ముందు రోజు సింగిల్ ఫన్ బ్లాక్ అంటూ ఓ స్పెషల్ వీడియోని సోషల్ మీడియాలో షేర్ చేసారు. టీం అంతా కలిసి సందడి చేసిన ఈ ఈవెంట్ ఎంతో సరదాగా సాగింది. ఈ సందర్భంగా హీరో హీరోయిన్లు, దర్శక నిర్మాతలు సినిమాకి సంబంధించిన పలు ఇంట్రెస్టింగ్ విషయాలను పంచుకున్నారు.

'సింగిల్' మూవీలో ఓ సీన్ షూటింగ్ చేస్తున్నప్పుడు తనకు బ్రేకులు లేని బైక్ ఇచ్చారని శ్రీ విష్ణు వెల్లడించారు. "బ్రేకులు లేని బైకులు మనం చూశాం. బ్రేక్స్ పడటం పడకపోవడం తర్వాత సంగతి.. అసలు దానికి బ్రేక్ రాడ్ కూడా లేదు. షూటింగ్ అప్పుడు నన్ను అలాంటి బైక్ మీద వెళ్ళమన్నారు. బ్రేక్స్ లేవని చెబితే.. ఉన్నాయని చెప్పి మరీ పంపించారు" అని శ్రీవిష్ణు చెప్పారు. దాని గురించి నిర్మాత విద్యాని యాంకర్ సుమ ప్రశ్నించగా.. "బ్రేకులు ఉన్నాయో లేదో తెలియడానికి బైకులు ట్రైల్ చేసి ఇవ్వరు కదా" అని నవ్వుతూ అన్నారు.



అల్లు అరవింద్ మైక్ అందుకొని "లాస్ట్ షాట్ లో హీరోకి ఏదైనా యాక్సిడెంట్ అయితే సినిమాకి పాపులారిటీ వస్తుందని విద్యా అలా ప్లాన్ చేసిందేమో అని భయం" అని సరదాగా అన్నారు. 'సింగిల్' విడుదల నేపథ్యంలో ఈ వీడియో క్లిప్పింగ్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. కానీ సినిమా శ్రీవిష్ణు చెప్పిన బైక్ సీన్ లేదని పలువురు నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు.

# దుల్లగొట్టేసిన నర్సీపట్నం కుర్రోడు

నటిగా స్టార్ హీరోయిన్ అనిపించుకున్న సమంత నిర్మాతగా మారింది. 'ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్'లో ఆమె నటిస్తూ నిర్మించిన తొలి చిత్రం 'శుభం' నేడు (మే 09) థియేటర్స్‌లో విడుదలై పాజిటివ్ టాక్‌ని రాబట్టింది. ఆడాళ్లకి సీరియల్‌కి ఉన్న బంధం ఫెవికాల్ బంధం లాంటిది. ఒక్కసారి అతుక్కుందంటే ఎంత లాగినా సా..గుతుంది తప్పితే అస్సలు వదలదు. సీరియల్స్ పిచ్చి కూడా పీక్స్‌లోనే ఉంటుంది. ఏళ్లకి ఏళ్లు సా.. గదీస్తూ అసలు ఎప్పుడు 'శుభం' కార్డ్ పడుతుంతో తెలియని సీరియల్ కథాంశంతో వచ్చి చిత్రం 'శుభం'. సినిమాపై ఉన్న నమ్మకంతో రెండు మూడు రోజులు ముందుగానే ప్రీమియర్ షోలను ప్రదర్శించగా ఇండస్ట్రీ వర్గాల నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. అలాగే శుక్రవారం నాడు విడుదలైన ఈ చిత్రానికి ఫస్ట్ షో నుంచి పాజిటివ్ రెస్పాన్స్ వచ్చింది. శుభం మూవీ రివ్యూ కోసం ఇక్కడ క్లిక్ చేయండి. ?? 'శుభం' మూవీ రివ్యూ.. సమంతకి శుభమ్‌తో పాటు లాభమ్



కాగా ఈ సినిమాలో 'ఆల్ఫా మేల్'గా కీలకపాత్రలో నటించిన గవిరెడ్డి శ్రీనివాసరావు కామెడీ టైమింగ్‌తో అదరగొట్టేశాడు. క్రాక్, వీరసింహారెడ్డి తదితర చిత్రాలకు రచయితగా, కో రైటర్‌గా పనిచేసి.. అనుభించు రాజా, సీతమ్మ అందాలు రామయ్య చిత్రాలు వంటి సినిమాలను డైరెక్ట్ చేసిన నర్సీపట్నం కుర్రాడు గవిరెడ్డి శ్రీనివాసరావు శుభం సినిమాలో ఆల్ఫా పురుషుడిగా ఫుల్ లెంగ్త్ రోల్ చేశారు.

# తప్పకుండా సినిమాలు తీస్తా.. బ్లాక్ బస్టర్స్ ఇస్తా

బండ్ల గణేష్ సినిమాలు తీసి చాలా కాలం అవుతోంది. చాలా గ్యాప్ తరువాత సరిలేరు నీకెవ్వరు అనే సినిమాలో నటించాడు. మూవీ విడుదలైన తరువాత తన పాత్రకు వచ్చిన విమర్శలకు బండ్లన్న బాధపడ్డాడు. అలాంటి పాత్రలు ఇంకో సారి చేయను అని బహిరంగంగానే చెప్పేశాడు బండ్ల గణేష్. ఇక నటించడం కన్నా.. నిర్మించడం బెటర్ అని అప్పుడే బండ్ల గణేష్ చెప్పాడు.



రాజకీయాలకు ఇక దూరం అని బండ్ల గణేష్ ప్రకటించాడు. కానీ మళ్లీ రాజకీయాలతోనే బిజీగా ఉంటున్నాడు. గబ్బర్ సింగ్ రీ రిలీజ్ టైంలోనూ ఇకపై సినిమాలే తీస్తానని అన్నాడు. కానీ ఇంత వరకు ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు. చేస్తే స్టార్ హీరోలతో భారీ బడ్జెట్ చిత్రాలే తీస్తా అని అప్పట్లో అన్నాడు. కానీ మళ్లీ మనసు మార్చుకుని.. మంచి కాన్సెప్ట్ ఉంటే ఎవరితో అయినా సినిమాలు చేస్తానని అన్నాడు. మాటలు మాత్రం చాలానే వస్తున్నాయి.. కానీ చేతలు మాత్రం అడుగు కూడా ముందుకు పడటం లేదనిపిస్తోంది.

గబ్బర్ సింగ్ రీ రిలీజ్ టైంలో హంగామా చేసిన బండ్ల గణేష్ మళ్లీ ఇంత వరకు సినిమాల అప్డేట్ ఇవ్వలేదు. అసలు బండ్లన్న కథలు వింటున్నాడా? హీరోల్ని అప్రోచ్ అవుతున్నాడా? అన్నది తెలియడం లేదు. తాజాగా ఓ నెటిజన్ వేసిన ట్వీట్‌కు మాత్రం బండ్ల గణేష్ రిప్లై ఇచ్చాడు. ఒకప్పుడు నిర్మాతగా దూసుకుపోయిన బండ్లన్న ఇప్పుడు ఎక్కడ ఉన్నాడు? ఎందుకు సినిమాలు తీయడం లేదు అని అడిగాడు. దీనికి సమాధానంగా బండ్ల గణేష్ స్పందించాడు. తిరుమల కొండ మీద నుంచి చెప్తున్నా.. తప్పకుండా సినిమాలు తీస్తా.. బ్లాక్ బస్టర్స్ ఇస్తా అని అంటున్నాడు. మరి ఈ మాట మీద అయినా బండ్లన్న నిలబడతాడా? లేదా? అన్నది చూడాలి. బండ్ల గణేష్ మాత్రం సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గానే ఉంటాడు. ఎవరికైనా ఏదైనా సాయం కావాలంటే చేస్తాడు. ఇక పవన్ కళ్యాణ్ గురించి బండ్లన్న ఎప్పుడూ ఆలోచిస్తూనే ఉంటాడు. ఆ మధ్య పవన్ కళ్యాణ్ హెల్త్ బాగా లేదని తెలియడంతో ట్విట్టర్ వేదికగా స్పందించాడు బండ్లన్న. త్వరగా కోలుకోవాలని ఆ దేవుడ్ని ప్రార్థిస్తున్నాను అంటూ ట్వీట్ వేశాడు.

# 62 ఏళ్ల క్రితం మరుపురాని రోజు..

రాఘవేంద్రరావు చిత్ర సీమలోకి అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. రాఘవేంద్రరావు తండ్రి ప్రకాశరావు దర్శకుడే అయినా కూడా.. కమలాకర కామేశ్వరరావు వద్ద అసిస్టెంట్‌గా కొన్ని రోజులు పని చేశారు. కమలాకర కామేశ్వరరావు దగ్గర అసిస్టెంట్‌గా కొన్ని రోజులు పని చేశారట. ఆ టైంలోనే ఆయన తీసిన పాండవ వనవాసం సినిమాకి మొదటి సారిగా క్లాప్ కొట్టారట.

దర్శకేంద్రులు కె. రాఘవేంద్రరావుకి ఎన్టీ రామారావు అంటే ఎంత ఇష్టమో అందరికీ తెలిసిందే. దర్శకుడిగా రాఘవేంద్రరావు మారక ముందు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేశాడు. ఇక రాఘవేంద్రరావు తండ్రి కోవెలమూడి ప్రకాశరావు అప్పటికే మంచి దర్శకుడిగా తెలుగు చిత్ర సీమలో రాణిస్తున్నారు. తండ్రి పెద్ద దర్శకుడు అయినా రాఘవేంద్రరావు మాత్రం తన తండ్రి వద్ద అసిస్టెంట్‌గా పని చేయలేదు. కమలాకర కామేశ్వరరావు దగ్గర కొన్నాళ్ళు సహాయకుడిగా పనిచేశాడు. ఆ టైంలోనే ఎన్టీ రామారావుతో ఆయన పాండవ వనవాసం సినిమా తీస్తున్నారు.

సరిగ్గా 62 ఏళ్ళ క్రితం ఇదే రోజున అంటే.. 1963 మే 9న కె. రాఘవేంద్రరావు సహాయ దర్శకునిగా 'పాండవ వనవాసం' చిత్రానికి మహా నటుడు ఎన్టీఆర్‌పై తొలి క్లాప్ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'నేను ఫస్ట్ క్లాప్ కొట్టిన రోజు.. అది 1963 వ సంవత్సరం.. మద్రాసు కోడంబాకంలో విజయవాహిని స్టూడియోలో ఉదయం సుమారు 7 గంటల 27 నిమిషాలు.. గడియారం చూస్తూ.. రెడీ క్లాప్ అని అన్నారు దర్శకులు పౌరాణిక బ్రహ్మ- గురువుగారు శ్రీ కమలాకర కామేశ్వరరావు.. సినీ కళామతల్లి నాతో క్లాప్ మీద ఓనమాలు దిద్దించింది.






ఇంతకీ మొట్టమొదటి క్లాప్ ఎవరిమీదో తెలుసా.? సాక్షాత్ భగవత్ స్వరూపుడు- విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు నందమూరి తారక రాముడు పాండవ వనవాసంలో భీమసేనుని పాత్ర.. "మనోజవం మారుతి తుల్య వేగం" అంటూ ఆంజనేయుడ్ని చూసి పాడుతుంటే నేను అలా కళ్లు పెద్దవి చేసుకుని ఆయన హావభావాలు చూసినప్పుడు ఆహా ఎంత అదృష్టవంతుడ్ని అనుకున్నాను. భీమసేనుడిది వెయ్యి ఏనుగుల బలం.. ఆంజనేయుడు బలం తనకే తెలియదు.. ఇద్దరూ వాయుపుత్రులు ఆ ఇద్దరూ- ఒకరు భీమసేనుడు రామారావు గారు, మరొకరు మా నిర్మాత ఆంజనేయులు గారు వీళ్ళిద్దరి ఆశీస్సులతో మొదలైంది నా సినిమా ప్రయాణం.. ఒక్కసారి వెనక తిరిగి చూసుకుంటే.. ఆరోజు కొట్టిన క్లాప్ ఇన్ని కోట్లమందితో క్లాప్స్ కొట్టిస్తుందని ఊహకందని విషయం' అని నాటి రోజుల్ని గుర్తు చేసుకున్నారు. రాఘవేంద్రరావు ప్రస్తుతం జగదేక వీరుడు అతిలోక సుందరి రీ రిలీజ్‌తో బిజీగా ఉన్నారు.